కార్యాలయ ఆవరణే ఇలా ఉంటే..

బస్తీలు, కాలనీల సంగతేంటి.?



దుర్గంధంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ కార్యాలయ ఆవరణ

కుత్బుల్లాపూర్: మన కాలనీలు, బస్తీల్లో మురుగు సమస్య ఉంటే జంట సర్కిళ్ల పరిధిలోని అధికారులకు ఫిర్యాదు చేస్తాం.. అదే కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ కార్యాలయాల ఆవరణలో మురుగు సమస్య ఉంటే.. అధికారులు ఎవరికి ఫిర్యాదు చేస్తారు? వీలైతే దగ్గరుండి సమస్యను పరిష్కరిస్తారు. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. ఇద్దరు ఉపకమిషనర్లు తమ కార్యాలయానికి వెళ్లే దారిలోని భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీ పక్కన ప్రాంతంలో మురుగు నిలుస్తోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నా అక్కడి నుంచి నిత్యం వెళ్లే అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. సర్కిల్ కార్యాలయంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక కాలనీలు, బస్తీల సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు.

నిత్యావసరాల అందజేత..

పిల్లలను చదివిస్తామని భరోసా



నిత్యావసరాలను అందజేస్తున్న మీ కోసం ఫౌండేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: ఆపదలో ఉన్న వారికి మీ కోసం ఫౌండేషన్ ఆపన్నహస్తం అందజేస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు కట్టిబోయిన శివకుమార్‌యాదవ్ అన్నారు. సూరారం ప్రాంతానికి చెందిన కొల్లూరు శ్రీనివాస్, లక్ష్మి దంపతులు అనారోగ్య సమస్యల కారణంగా ఇంటి వద్దనే ఉండటంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. దీంతో వారి పిల్లలు సైతం చదువులకు దూరమయ్యారు. వారి కుటుంబం పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు స్పందించారు. శుక్రవారం ఫౌండేషన్ తరఫున శ్రీనివాస్ కుటుంబానికి 3 నెలలకు సరిపడా నిత్యవసరాలను అందజేశారు. అంతే కాకుండా పిల్లల చదువుల బాధ్యత తమ ఫౌండేషన్ తీసుకుంటుందని భరోసా కల్పించారు. ఫౌండేషన్ సభ్యులు భాగ్యశ్రీ, బత్తుల అయ్యప్ప, హలిగి నర్సింగ్ తదితరులు ఉన్నారు.

సమన్వయ లోపం...

వాహనదారులకు నరకం

- అధికారులకు సమన్వయం లేదు..
- వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు



అధ్వానంగా మారిన గాంధీనగర్ - సంజయ్‌గాంధీనగర్ రోడ్డు

రంగారెడ్డినగర్: ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, రంగారెడ్డినగర్‌లను ఆనుకుని గాంధీనగర్ పారిశ్రామికవాడ విస్తరించింది. కొంత భాగం ఐలా పరిధిలో.. మరికొంత భాగం జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వస్తుండటంతో స్థానికంగా అభివృద్ధి విషయంలో ఇరు శాఖల అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గాంధీనగర్ నుంచి సంజయ్‌గాంధీనగర్ మీదుగా జగద్గిరిగుట్టకు వెళ్లే రోడ్డు గతుకులమయంగా మారింది. వర్షం పడితే రోడ్లపై వరదనీరు చేరి మరింత అధ్వానంగా మారుతోంది. ఈ రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకుని రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి రాకపోకలకు అనువుగా మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

కుత్బుల్లాపూర్ బీజేపీ కో.కన్వీనర్ శివాజీరాజుకు సన్మానం



కో.కన్వీనర్‌గా నియమితులైన శివాజీ రాజును సత్కరించిన బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కో.కన్వీనర్‌గా నియమితులైన పొత్తూరి శివాజీరాజును శుక్రవారం కొంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకులు సత్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.శివాజీ రాజు స్థానిక సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలను వివరించారు. సెన్సార్ బోర్డు సభ్యురాలు సరితరావు మాట్లాడుతూ.. శివాజీరాజు సేవలను పార్టీ అధిష్టానం నియోజకవర్గ వ్యాప్తంగా ఉపయోగించుకుంటుందని... భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని అభిలాషించారు. ఈ సన్మాన కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మధు, ఆకుల శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రామిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు



భాగ్యలక్ష్మి కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగును పరిశీలిస్తున్న సీజీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుంటామని జలమండలి సీజీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. పలు ప్రాంతల్లో రోడ్లపై పారుతున్న మురుగు విషయమై ఫిర్యాదుల రావడంతో శుక్రవారం శ్రీధర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. భాగ్యలక్ష్మి కాలనీ, శ్రీకృష్ణనగర్‌లలో పర్యటించిన ఆయన రోడ్డుపై పారుతున్న మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నాలాల నిర్మాణం చేపట్టిన సర్కిల్ అధికారులు స్థానికంగా చేపట్టకుండా వదిలేయడం వల్లే మురుగు రోడ్డుపై పారుతుందని పేర్కొన్నారు. జలమండలి ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేసి మురుగు కాలువలను నిర్మిస్తామన్నారు.

వైభవంగా ఆలయ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం



నిజాంపేట్‌లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ తదితరులు

నిజాంపేట్: నిజాంపేట్ కెనరా బ్యాంక్ రోడ్డులో ఉన్న నల్లపోచమ్మ ఆలయ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఆవుల జగన్‌యాదవ్, నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహచారి, కమిటీ సభ్యులు మహేందర్‌రెడ్డి, ఎల్లయ్య, సంతోష్, మహేందర్‌యాదవ్, కుమ్మరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ చాలా కీలకం

సీనియర్ భారత దౌత్యవేత్త డా. దీపక్ ఓహ్రా



రాయదుర్గం: కమ్యూనికేషన్ అనేది కీలకపాత్ర పోషిస్తుందని భారత దౌత్యవేత్త డాక్టర్ దీపక్ ఓహ్రా అన్నారు. నానక్‌రాంగూడలో సోషల్ ఇంటెలిజెన్స్ బూత్‌క్యాంప్‌ను క్యాటలిస్ట్ సంస్థ శుక్రవారం ప్రారంభించింది. మూడు రోజులపాటు సాగే ఈ కార్యక్రమం 21 సెషన్‌లుగా ఉంటుంది. 15 మంది వక్తలు పాల్గొంటున్నారు. మొదటిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన డాక్టర్ దీపక్ ఓహ్రా మాట్లాడుతూ భారతదేశం భారత్‌గా మారే సమయంలో తన గమ్యానికి నమ్మకంగా ముందుకు సాగుతున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. సాధికార కమ్యూనికేషన్ మొక్క లక్ష్యం అందరిలోనూ విశ్వాసాన్ని నెలకొల్పడం, సందేశాన్ని నమ్మదగినదిగా రూపొందించి వారి ముందుంచడం అవసరమన్నారు. అనందితా ఎం సిన్హా, హర్షవర్ధన్ ఎర్రా, మేఘన తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో శంషాబాద్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ప్రతినిధులు , విశాఖపట్నం చైర్మన్ వై.వరప్రసాద్‌రెడ్డి, సైబరాబాద్ డీసీపీ నరసింహ పాల్గొన్నారు.

విశ్వకర్మల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన 'కార్పొరేట్'



నికారా డైమండ్ జ్యువెలరీ ప్రారంభిస్తున్న దాసోజు శ్రవణ్ కుమార్

పంజగుట్ట: జ్యువెలరీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించిన విశ్వకర్మల ఆత్మగౌరవం దెబ్బతీశాయని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం, కాకతీయ, రాచకొండ మూడు మన ప్రాంత సాంస్కృతిక చరిత్రను ప్రతిభింభించేలా నికారా అనే పేరుతో డైమండ్ జ్యువెలరీ షోరూం ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. శుక్రవారం పంజగుట్ట గలేరియా మాల్‌లో షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డైమండ్ జ్యువెలరీ అంటే కేవలం డబ్బున్నవారికే పరిమితమన్న అపోహను నికారా జ్యువెలరీ నిర్వాహకుడు శ్రీనివాసాచారి తొలగించారని పేర్కొన్నారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: బాచుపల్లి ఎస్ఎల్‌జీ ఆస్పత్రి సౌజన్యంతో ఈనెల 26న నిజాంపేట్ బండారి లేఅవుట్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బండారి లేఅవుట్ కమిటీహాల్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగే శిబిరంలో జనరల్ సర్జన్, కార్డియాలజీ, పాల్మనాలజీ, పిల్లలు, స్త్రీ సంబంధిత వ్యాధుల వైద్యులు పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు



మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం తెలంగాణ శాసనమండలి కార్యాలయంలో జరిగాయి. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'రాంగ్ రూటు.. ఏడుగురిపై కేసు'

కుత్బుల్లాపూర్: రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతున్న ఏడుగురు వ్యక్తులపై ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 11.50 గంటల ప్రాంతంలో కొంపల్లి నుంచి బొల్లారం వైపు వెంకటేష్ (టీఎస్08 జీటీ 5763), నాగేష్ (ఏపీ 37బీఎస్7647), రవి (టీఎస్ 16 ఎఫ్‌హెచ్ 5619), అశోక్ (టీఎస్08 జీటీ 7074), మురళీధర్ (ఏపీ ఈ9 సీటీ 0823), జాషువా (టీఎస్ 15ఎఫ్‌ఎం 0710), ప్రభుసింగ్ (ఏపీ 11 ఏజె 6831) రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఇతర వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగించడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



కెమెరాలను ప్రారంభిస్తున్న సాతాల గోపాల్

సుభాష్‌నగర్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని రావి నారాయణరెడ్డినగర్ ప్రెసిడెంట్ సాతాల గోపాల అన్నారు. శుక్రవారం రావినారాయణరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులతో కలిసి సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. కాలనీలోని రద్దీగా ఉండే ఆలయాలు, చౌరస్తాలో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పరమేశ్, అడ్వైజర్లు గోపి, ప్రసాద్, గణపతి, సభ్యులు రవి, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు లేదా జేఎన్‌టీయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని తెలంగాణ మాల స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలో 107 ఏళ్ల ఓయూ, 51 ఏళ్ల జేఎన్‌టీయూకు ఇంత వరకు ఒక్క ఎస్సీ ప్రొఫెసర్‌ను కూడా వీసీగా నియమించలేదన్నారు. ఇదిలా ఉండగా పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వెంకట్ కోరారు.

'వడ్డీ లేని రుణాలు రావడం లేదు'



సమావేశమైన డ్వాక్రా గ్రూపు మహిళలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి ఆసియా బేగం అధ్యక్షతన శుక్రవారం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఉమా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరేళ్లుగా చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ వచ్చే నెల 19వ తేదీన టీఎల్‌ఎఫ్ కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. 2015 నుంచి ఇప్పటి వరకు వడ్డీ లేని రుణాలు రావడంలేదని వారు బ్యాంక్ మేనేజర్‌కు తెలిపారు. మొత్తం టీఎల్ఎఫ్ 72 గ్రూపులు ఉండగా వాటిలో కొంతమందికి రుణాలు రాకపోవడంతో దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలని మహిళలు తీర్మానం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళా గ్రూపు సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించాలని కోరారు.

80 ఏళ్ల వయసులోనూ

ఈదేశాడు.!

మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో విజేతగా నిలిచాడు



సహచరులతో మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఈత పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో స్విమ్మింగ్ పోటీల్లో పలు విభాగాల్లో విజేతగా నిలిచారు. ఫ్రీస్టైల్ 200 మీటర్లు, బ్రెస్ట్ స్ట్రోక్ 100 మీటర్ల విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కే.శ్రీనివాస రావు హర్షం వ్యక్తం చేశారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 80 ఏళ్ల వయస్సులోనూ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చాటుతున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. లక్ష్మణ్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తమ కళాశాలలో అంతర్జాతీయ స్థాయి క్రీడా సదుపాయాలు కల్పించామన్నారు. అంతే కాకుండా ప్రతి సంవత్సరం రూ.1.5కోట్లు క్రీడాకారుల కోటాలో స్కాలర్‌షిప్స్ ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

జూన్ 10 నుంచి ఆమరణ దీక్ష

పంజగుట్ట: విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జూన్ 10వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల ఇండిపెండెంట్ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ, వివిధ విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న గత ప్రభుత్వాన్ని దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినా ఒరగబెట్టింది ఏమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గెలవగానే ఇటు నిరుద్యోగులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు బాసటగా నిలుస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేనా.?

- 507 ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య 89,565
- ఈ ఏడాది అవసరమైన పుస్తకాల సంఖ్య 5.78 లక్షలు
- గోదాముల్లో నిల్వ ఉన్న పుస్తకాల సంఖ్య 4.02 లక్షలు
- మండలాలకు చేరినవి 1.03 లక్షలు
- ప్రారంభం రోజే పంపిణీ చేస్తామంటున్న విద్యాశాఖ



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్న సర్కారు.. మరో పక్షం రోజుల్లో విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుండటంతో పుస్తకాల పంపిణీపై విద్యాశాఖ దృష్టి సారిస్తోంది. ఈసారి యూనిఫాం మాదిరిగానే.. ముందస్తుగా అందరికీ పాఠ్య పుస్తకాలు అందిస్తామని విద్యాశాఖ పేర్కొంటోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 89,565 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఈ విద్యాసంవత్సరంలో 5,78,980 పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టగా, ఇప్పటి వరకు 4,02,780 పుస్తకాలు వచ్చాయి. ఇందులో 1,03,355 పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు మండల కేంద్రాలకు చేర్చారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు వాటిని ఎలా పంపిణీ చేయాలని విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

పక్కదారి పట్టకుండా..

ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా ఉండాలన్న ఉద్దేశంతో పకడ్బందీ చర్యలు చేపట్టారు. రెండేళ్లుగా ప్రభుత్వం పంపిణీ చేసే పుస్తకాలపై ప్రత్యేక సంఖ్యను ముద్రించడంతో పాటు ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ఆధార్ నంబర్ వివరాలు నమోదు చేసుకున్నాకే పాఠ్య పుస్తకాలు అందిస్తారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే ఉచిత పాఠ్యపుస్తకాలు అందుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: మల్లంపేట ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం బొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి కిరణ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మల్లంపేట గ్రామం, జీఎల్‌సి భవన్స్ విల్లాస్, డ్రీమ్ వ్యాలీ కాలనీ, ఆకాశ్ లేఅవుట్, గ్రీన్ పార్క్, ఏపీఆర్ విల్లాస్ ప్రాంతాల్లో... మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు బాలాజీ ఎన్‌క్లేవ్, ఖాజిపల్లి రోడ్డు, ప్రణీత్ జెమ్స్, ఆంధ్రాబ్యాంక్ వెనుక భాగం, బీసీకాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో...

- కుత్బుల్లాపూర్: నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలోని నాగార్జున డ్రీమ్ ల్యాండ్, శాంతినికేతన్, అమృత ప్రాజెక్ట్స్, నూజివీడు సీడ్స్ కంపెనీ, గజానన హోమ్స్, రాయల్ పార్క్ ఏరియా, అశ్విని కాలనీ, సిల్వర్ నెస్ట్ విస్తారా, గ్రీన్ కంట్రీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు...
- కొంపల్లి ఫీడర్ పరిధిలోని కొంపల్లి గ్రామం, మున్సిపల్ కార్యాలయం, సెంట్రల్ పార్క్, రత్నదీప్, క్లౌడ్‌నైన్ ఆస్పత్రి, డిలైట్ హోటల్, బొడ్డురాయి ప్రాంతం, కుమ్మరి బస్తీ, ఆంధ్రబస్తీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

గాజులరామారం సెక్షన్ పరిధిలో..

- సుభాష్‌నగర్: గాజులరామారం ఫీడర్ పరిధిలోని ఉషోదయ కాలనీ, చిత్తారమ్మ ఆలయం, వెంకటేశ్వర గార్డెన్స్, బాలాజీ లేఅవుట్, రాయల్ ఫామ్స్, గాజులరామారం గ్రామంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు...
- మహదేవపురం ఫీడర్ పరిధిలోని యండమూరి లేఅవుట్, ద్వారకానగర్, మల్లారెడ్డినగర్, మహదేవపురం, శ్రీరామచంద్రనగర్, బాలయ్య బస్తీ, వడ్డెర బస్తీ, గాజులరామారం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్య భార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో

నిజాంపేట్: ఎస్ఎంఎస్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, బాచుపల్లి, పోచమ్మ ఆలయం, బాచుపల్లి కమిటీహాల్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు...

- సాయినగర్ ఫీడర్ పరిధిలోని సాయినగర్, రాజీవ్‌గృహకల్పలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు...
- వికాస్ ఫీడర్ పరిధిలోని వికాస్ పబ్లిక్ స్కూల్, సాయికృష్ణ హిల్స్, సూర్య గ్లోబల్ స్కూల్, టెక్నో పోలీస్ అపార్ట్‌మెంట్స్, తెలంగాణ ఇంజనీర్స్ బిల్డింగ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ శాంత కుమార్ తెలిపారు.

ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో...

నిజాంపేట్: మిథిలానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 12.30 వరకు, అదే విధంగా 11కేవీ పంచవటి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు వెంకటేశ్వరస్వామి ఆలయం, మిథిలానగర్ సర్కిల్, ఆర్‌కే లేఅవుట్, ఆదిత్య వెంచర్, డాలర్‌హిల్స్, ప్రశాంతి గోల్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సమ్మయ్య తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్-24 ప్రవేశ పరీక్ష

రాయదుర్గం: పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. శేరిలింగంపల్లిలోని అయిదు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1085 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 920 మంది హాజరయ్యారు. శేరిలింగంపల్లి పరిధిలోని జీఐఎల్‌టీ రాయదుర్గం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయదుర్గం, గచ్చిబౌలి,నార్సింగి, మణికొండ ప్రాంతాలలో పరీక్షా కేంద్రాలను నిర్వహించగా కేంద్రాలను పాలిసెట్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ అధికారి, జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ పర్యవేక్షించారు.

పదిరోజుల్లో ఫలితాలు

- రాష్ట్రంలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలను పదిరోజుల్లో ప్రకటించేందుకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్‌హుస్సేన్ తెలిపారు.

అలరించిన నిథమ్ 'ఫుల్ మూన్ ఫెస్ట్'

రాయదుర్గం: కేరింతలు, ఈలలు, చప్పట్లతో గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్ దద్దరిల్లింది. నిథమ్ క్యాంపస్‌లోని హంపీ థియేటర్‌లో గురువారం రాత్రి 'నిథమ్ ఫుల్‌మూన్ ఫెస్ట్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నిథమ్‌లోని బీబీఏ 6వ సెమ్ విద్యార్థుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. లైవ్ బ్యాండ్ ఆర్టిస్ట్ తార, డీజే రోహిత్‌ల పాటలను విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు ఆస్వాదించారు. సంగీతానికి అనుగుణంగా నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

సీఆర్ ఫౌండేషన్‌కు రూ.5 లక్షల విరాళం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు ప్రముఖ వాణిజ్య సంస్థ జన చైతన్య హౌసింగ్ అధినేత మాదల సుధాకర్ శుక్రవారం రూ.5 లక్షల విరాళంను డాక్టర్ నారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సీఆర్ పాలిక్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వహణకు వినియోగించవలసిందిగా కోరారు. అనంతరం సీఆర్ ఫౌండేషన్‌లో వృద్ధాశ్రమంను సందర్శించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణ, ప్రధానకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజని పాల్గొన్నారు.